ట్రైనీ డాక్టర్ హత్యాచారంపై
రేపు సుప్రీం విచారణ

- సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు
- ప్రతి రెండు గంటలకు నివేదిక ఇవ్వండి
- వైద్యుల ఆందోళనల నేపథ్యంలో శాంతి భద్రతలపై రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలు

న్యూఢిల్లీ/కోల్‌కతా, ఆగస్టు 18: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ దవాఖానలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఈ కేసుపై ఈ నెల 20న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టనున్నది. ఈ కేసు దర్యాప్తును కలకత్తా హైకోర్టు ఇటీవల కోల్‌కతా పోలీసుల నుంచి సీబీఐకి బదిలీ చేసింది. మరోవైపు, దేశవ్యాప్తంగా వైద్యులు, నర్సుల ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్రాల్లో శాంతి భద్రతలపై ప్రతి రెండు గంటలకోసారి నివేదిక పంపాలని ఆయా రాష్ట్రాల పోలీసు శాఖలను కేంద్ర హోంశాఖ ఆదేశించింది.

బీజేపీ మాజీ ఎంపీ, ఇద్దరు డాక్టర్లకు పోలీసుల సమన్లు

హత్యాచారానికి గురైన బాధిత ట్రైనీ డాక్టర్ గుర్తింపు వెల్లడి, వదంతుల వ్యాప్తి చేస్తున్నారన్న ఆరోపణలపై కోల్‌కతా పోలీసులు ఆదివారం బీజేపీ మాజీ ఎంపీ లాకెట్ ఛటర్జీ, ఇద్దరు డాక్టర్లు కునాల్ సర్కార్, సువర్ణ గోస్వామిలకు సమన్లు జారీచేశారు.

తృణమూల్ కాంగ్రెస్‌లో విభేదాలు

ట్రైనీ డాక్టర్‌పై హత్యాచార ఘటన బెంగాల్‌లో అధికార టీఎంసీలో విభేదాలకు దారితీసింది. 'సీబీఐ పారదర్శకంగా వ్యవహరించాలి. బాధితురాలి ఆత్మహత్య కథను ఎవరు అల్లారో తెలియాలంటే మాజీ ప్రిన్సిపాల్, పోలీసు కమిషనర్‌ను కస్టడీ విచారణ చేయాలి' అని టీఎంసీ రాజ్యసభ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ ఎక్స్ పోస్టులో డిమాండ్ చేశారు. మూడు రోజుల తర్వాతనే పోలీసుల జాగిలాలను తీసుకొచ్చారని, ఇలాంటి వందల ప్రశ్నలు ఉన్నాయని అన్నారు. అయితే శేఖర్ రాయ్ డిమాండ్లను మరో నేత కునాల్ ఘోష్ వ్యతిరేకించారు. హత్యాచార ఘటన గురించి తెలిసినప్పటి నుంచి పోలీసు కమిషనర్ తగిన విధంగా స్పందించారని, అవసరమైనదంతా చేశారని అన్నారు.

ఒక్కటైన ప్రత్యర్థులు

హత్యాచార ఘటనపై రాష్ట్రంలో నిరసనలు హోరెత్తుతున్నాయి. ఫుట్‌బాల్‌లో బద్ధ విరోధులైన ఈస్ట్ బెంగాల్, మోహన్ బగాన్ జట్టు సభ్యులు ఆదివారం సాల్ట్ లేక్ స్టేడియం వద్ద ఉమ్మడిగా నిరసన ప్రదర్శన చేపట్టారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బందిపై దాడుల్ని అరికట్టేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని పద్మ పురస్కారాలు అందుకున్న 70మంది వైద్యులు ప్రధాని మోదీకి లేఖ రాశారు.

సీఎం మమతపై నమ్మకం పోయింది
ట్రైనీ డాక్టర్ తల్లిదండ్రుల ఆగ్రహం

కోల్‌కతా హత్యాచార ఘటనలో పోలీసులు, సీఎం మమతా బెనర్జీ తీరుపై మృతురాలి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'కేసులో న్యాయం చేకూర్చేందుకు సీఎం మమత ఏమీ చేయలేరని అర్థమైంది. ఆ దిశగా ఆమె చేస్తున్నది ఏమీ లేదు. న్యాయం కావాలంటూనే.. నిరసనల్ని అణచివేస్తున్నారు' అంటూ ట్రైనీ డాక్టర్ తండ్రి వాపోయారు. కేసును వెంటనే ముగించేందుకు, నిరసనలను అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు, వారం గడిచినా దర్యాప్తు వేగవంతం కాకపోవడాన్ని క్రికెటర్ హర్భజన్‌సింగ్ ప్రశ్నించారు. నేరస్థుడికి త్వరగా శిక్షపడితేనే బాధితురాలి ఆత్మ శాంతిస్తుందన్నారు. ఈ మేరకు మమతకు లేఖరాశారు.

ఆమెకు రక్షణేది?

కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటన.. దేశంలో మహిళల భద్రతపై మరోసారి చర్చను లేవనెత్తింది. 2012లో దేశంలో సంచలనం సృష్టించిన నిర్భయ ఘటన అనంతరం లైంగిక దాడులకు వ్యతిరేకంగా కఠిన చట్టాలు, నిబంధనలు తీసుకొచ్చినా ఈ కీచకపర్వానికి మాత్రం అడ్డుకట్ట పడటం లేదు. దేశంలో గంటకు సగటున నలుగురు మహిళలు అఘాయిత్యాలకు బలవుతున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

దేశంలో గంటకు నాలుగు రేప్‌లు!

- రోజుకు 86 మందిపై లైంగికదాడులు
- అఘాయిత్యాలకు బలవుతున్న మహిళలు
- ఫ్రెండ్స్, బంధువులు, తెలిసినవాళ్లే నిందితులు
- శిక్షలు పడుతున్నది 27-28 శాతం కేసుల్లోనే

న్యూఢిల్లీ, ఆగస్టు 18: పని ప్రదేశాలు, ఇండ్లు, బయట.. ఇలా ఎక్కడ కూడా మహిళలకు రక్షణ లేకుండా పోయింది. దేశంలో మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని, దేశంలో ప్రతి గంటకు సగటున నలుగురు లైంగిక దాడులకు గురవుతున్నారని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2017-2022 మధ్య రోజుకు సగటున 86 రేప్ కేసులు నమోదవుతుండగా, 82 కేసుల్లో రేపిస్టులు బాధిత మహిళలకు తెలిసిన వాళ్లే కావడం మరింత ఆందోళన కలిగిస్తున్నది. 2017-2022 మధ్య దేశంలో మొత్తం 1.89 లక్షల లైంగిక దాడుల కేసులు నమోదయ్యాయని, ఇందులో 1.91 లక్షల మంది బాధితులుగా ఉన్నారని జాతీయ నేర గణాంకాల సంస్థ(ఎన్సీఆర్బీ) నివేదిక వెల్లడించింది. 1.79 లక్షల కేసుల్లో తెలిసిన వాళ్లే మహిళలపై లైంగిక దాడులకు పాల్పడటం గమనార్హం. దేశంలో భారీ సంఖ్యలో మహిళలపై లైంగిక దాడులు చోటుచేసుకుంటుంటే.. నిందితులకు శిక్ష పడుతున్న కేసులు చాలా తక్కువగా ఉంటున్నాయి. 2014-2022 మధ్య శిక్ష రేటు 27-28% శాతం మధ్యనే ఉన్నదని ఎన్సీఆర్బీ గణాంకాలు పేర్కొన్నాయి.

రాజస్థాన్‌లో అత్యధికంగా..

2022లో దేశవ్యాప్తంగా 31,516 లైంగిక దాడి కేసులు నమోదు కాగా, రాజస్థాన్‌లో అత్యధికంగా 5,399 నమోదయ్యాయి. తర్వాతి స్థానాల్లో మధ్యప్రదేశ్(3,029), మహారాష్ట్ర(2,904), యూపీ(3,690), ఢిల్లీ(1,212) ఉన్నాయి. ప్రతి లక్ష జనాభాకు చూస్తే ఉత్తరాఖండ్‌లో అత్యధికంగా లైంగిక దాడులు 15 ఉన్నాయి. తర్వాతి స్థానాల్లో 14 చొప్పున రాజస్థాన్, చండీగఢ్, హర్యానాలో 13, ఢిల్లీ, లక్షద్వీప్‌లో 12 చొప్పున ఉన్నాయి. మొత్తంగా 2022లో దేశంలో ప్రతి లక్ష జనాభాకు ఐదుగురు లైంగిక దాడులకు గురయ్యారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ఆఫీసుల్లోనూ లేని భద్రత

పని ప్రదేశాలు, ఆఫీసుల్లో కూడా మహిళలకు భద్రత లేకుండా పోయింది. యజమానులు, సహచర ఉద్యోగులే మహిళలపై అఘాయిత్యాలకు ఒడిగడుతున్నారు. పని ప్రదేశాల్లో రోజుకు సగటున ఒకరు చొప్పున లైంగిక వేధింపులకు గురవుతున్నారని ఎన్సీఆర్బీ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

నిరుపయోగంగా నిర్భయ ఫండ్ నిధులు!

2012లో ఢిల్లీ సామూహిక లైంగిక దాడి, హత్య ఘటన తర్వాత కేంద్రం నిర్భయ ఫండ్‌ను ఏర్పాటు చేసింది. మహిళల భద్రతకు ఉద్దేశించిన ఈ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరం నాటికి నిర్భయ ఫండ్‌కు రూ.7,213 కోట్లు కేటాయించగా, 2023, డిసెంబర్ 8 నాటికి రూ.5,119 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అంటే దాదాపు 30 శాతం నిధులను వినియోగించలేదు. ఖర్చు చేసిన నిధుల్లో కూడా రూ.1,435(28 శాతం) అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ వంటి 8 పెద్ద నగరాల్లోనే వినియోగించినట్టు కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

భారత్‌లో లైంగిక దాడుల కేసులు



2017-22 మధ్య లైంగిక దాడుల కేసులు: 1.89 లక్షలు

2022లో లైంగిక దాడుల కేసులు

రాష్ట్రం	కేసుల సంఖ్య
రాజస్థాన్	5,399
మధ్యప్రదేశ్	3,029
మహారాష్ట్ర	2,904
ఉత్తరప్రదేశ్	3,690
ఢిల్లీ	1,212

యజమానులు లేదా సహచర ఉద్యోగుల లైంగిక దాడులు

సంవత్సరం	రేప్‌ల సంఖ్య
2014	618
2015	577
2016	600

పని ప్రదేశాలు, ఆఫీసుల్లో లైంగిక వేధింపులు

సంవత్సరం	కేసులు
2017	485
2018	402
2019	509
2020	488
2021	419
2022	422

బస్సులో బాలికపై గ్యాంగ్‌రేప్
డెహ్రాడూన్‌లో దారుణం.. ఐదుగురి అరెస్ట్

డెహ్రాడూన్, ఆగస్టు 18: ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఈ నెల 12న అర్ధరాత్రి తనపై సామూహిక లైంగిక దాడి జరిగిందని ఓ బాలిక(15) ఆరోపించింది. తనపై అయిదు మంది బస్సులో లైంగిక దాడి చేశారని తెలిపింది. బస్టాండ్‌లోని ఓ దుకాణం కాపలాదారు ఆమె దీనస్థితిని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనలో నిందితులందరినీ పోలీసులు అరెస్ట్ చేశారు. బాలికకు చేయించిన వైద్య పరీక్షల నివేదిక కోసం పోలీసులు ఎదురుచూస్తున్నారు. ఘటన జరిగిన బస్సుతో పాటు, మరో బస్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. కాగా, బాధితురాలు మానసిక సమస్యలతో బాధ పడుతున్నది.

విద్యార్థినికి లిఫ్ట్ ఇచ్చి, అఘాయిత్యం
బెంగళూరులో దారుణం

బెంగళూరు: ఓ కళాశాల విద్యార్థిని (21)కి బైక్‌పై లిఫ్ట్ ఇచ్చిన వ్యక్తి, ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈస్ట్ జోన్ అదనపు పోలీస్ కమిషనర్ రమణ్ గుప్తా తెలిపిన వివరాల ప్రకారం, బాధితురాలు గెట్ టుగెదర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా, శనివారం అర్ధరాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆమెకు బైక్‌పై లిఫ్ట్ ఇచ్చాడు. ఆమెను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె తన స్నేహితులకు ఎమర్జెన్సీ మెసేజ్ పంపించి, లొకేషన్ షేర్ చేసింది. ఆమె స్నేహితులు వెళ్లి చూసేసరికి హెచ్ఎస్ఆర్ లేఅవుట్‌లోని హోసూర్ సర్వీస్ రోడ్డు సమీపంలో ఓ లారీ వెనుక కనిపించింది. ఆమె ఒంటిపై ఒక జాకెట్ మాత్రమే ఉంది. వారు ఆమెకు బట్టలు ఇచ్చి, సమీపంలోని దవాఖానకు తరలించారు. అదే సమయంలో వారికి ఆ లారీ దగ్గర ఓ వ్యక్తి కనిపించాడు. అతను ఆందోళనతో ఉన్నట్లు గుర్తించారు. అతనిని పట్టుకోబోగా, పారిపోయాడు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఉగ్రవాద నేరంగా స్త్రీ ద్వేషం
బ్రిటన్ ప్రభుత్వం యోచన

లండన్ : మహిళలు, బాలికల పట్ల హింసను నిరోధించేందుకు కఠినంగా వ్యవహరించాలని బ్రిటన్ ప్రభుత్వం యోచిస్తున్నది. ఇస్లామిస్ట్, ఫార్-రైట్ తీవ్రవాదంతో వ్యవహరించినట్లుగానే స్త్రీ ద్వేషులపై కూడా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నది. మహిళలు, బాలికలపై జరుగుతున్న హింస గురించి నేషనల్ పోలీస్ చీఫ్స్ కౌన్సిల్ ఇచ్చిన నివేదికలో ఇది జాతీయ స్థాయి అత్యవసర పరిస్థితి అని తెలిపింది. దీంతో మితిమీరిన స్త్రీద్వేషాన్ని ఉగ్రవాదంగా పరిగణించాలని ప్రభుత్వం యోచిస్తున్నది. ఈ సమస్యను పరిష్కరించేందుకు కౌంటర్ టెర్రరిజం స్ట్రాటజీని సమీక్షించాలని హోం సెక్రటరీ యెవెట్టీ కూపర్ ఆదేశించారు.

అమెరికాలో కారు ప్రమాదం..
భారత సంతతికి చెందిన ముగ్గురు మృతి

హ్యూస్టన్, ఆగస్టు 18: అమెరికాలోని హ్యూస్టన్‌లో జరిగిన కారు ప్రమాదంలో లియాండర్‌లో నివసించే భారత సంతతికి చెందిన ఒకే కుటుంబంలోని ముగ్గురు మరణించారు. టెక్సాస్‌లోని లాంపసస్ కౌంటీలో బుధవారం వీరు ప్రయాణిస్తున్న కారు మరో కారును ఢీకొన్న ప్రమాదంలో అరవింద్ మణి (45), అతని భార్య ప్రదీప అరవింద్ (40), వారి కుమార్తె ఆండ్రీ అవరింద్ (17) మరణించారు.ప్రమాదం జరిగినప్పుడు 14 ఏండ్ల వారి కుమారుడు అదిర్యన్ వారితో వాహనంలో లేడు. ఈ ప్రమాదంలో మొత్తం ఐదుగురు మరణించినట్టు పోలీసులు తెలిపారు.

యూఎస్‌లో నీటమునిగి ఏపీవాసి మృతి

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ: అమెరికాలో ప్రకాశం జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బుచ్చిబాబు (40) మృతి చెందారు. ప్రకాశం జిల్లా ముండ్లమూరు గ్రామానికి చెందిన దొద్దాల కోటేశ్వరరావు కుమారుడు బుచ్చిబాబు కాలిఫోర్నియాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. శనివారం బీచ్‌కు వెళ్లి ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందాడు.

7.90 సెం.మీ నాలుక.. గిన్నిస్ రికార్డ్

టెక్సాస్: అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన బ్రిట్టనీ లకాయో 7.90 సెం.మీ(3.11 అంగుళాలు) నాలుకతో ప్రపంచంలోనే అతి వెడల్పైన నాలుక కలిగిన మహిళగా గిన్నిస్ రికార్డ్ సొంతం చేసుకున్నారు. ఆమె నాలుక దాదాపు క్రెడిట్ కార్డ్ అంత వెడల్పు ఉంది. గతంలో అమెరికాకే చెందిన ఎమిలీ షెలెంకర్ పేరిట ఈ రికార్డ్ (7.33 సెం.మీ) ఉండేది. బ్రిట్టనీ అటార్నీగా పని చేస్తున్నారు. తాను చిన్నతనంలో ఏదైనా తినడానికి ఆతృతగా నోరు తెరిచినప్పుడు తన నాలుక పెద్దదిగా ఉందని తన కుటుంబం జోక్ చేసేదని బ్రిట్టనీ చెప్పారు. తన బ్రెస్ట్ ఫ్రెండ్ సూచనతో తన నాలుక వెడల్పు కొలుచుకున్నప్పుడు తనది పెద్ద నాలుక అన్న విషయం తెలిసిందన్నారు.

పోకిరీల స్టంట్లతో విసుగెత్తి..

బెంగళూరు: బైక్ విన్యాసాలు చేస్తున్న వారిపై విసుగు చెందిన ప్రయాణికులు వారికి బుద్ధి చెప్పే ప్రయత్నం చేశారు. ఈ నెల 15న బెంగళూరులోని అదకమరనహళ్లి దగ్గర రద్దీగా ఉండే 48 జాతీయ రహదారిపై స్టంట్స్ చేస్తున్న బైకర్లపై ఆగ్రహం చెందిన కొందరు ప్రయాణికులు మూడు బైక్‌లను ఫ్లై ఓవర్ నుంచి కిందకు తోసేశారు. బైక్ విన్యాసాలపై జూన్ వరకు ట్రాఫిక్ పోలీసులు 225 కేసులను నమోదు చేశారు. ఇప్పటివరకు బైక్ విన్యాసాలు చేసిన 9 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లను సస్పెండ్ చేశారు. గత రెండేండ్లలో బైక్ విన్యాసాలపై 552 కేసులు నమోదయ్యాయి.

రిజర్వేషన్లకు తూట్లు
పొడిచేందుకే!

యూపీఎస్సీ లేటరల్ ఎంట్రీ నియామకాలపై విపక్షాల ధ్వజం

న్యూఢిల్లీ, ఆగస్టు 18: ప్రభుత్వ అధికార యంత్రాంగంలో ఉన్నత స్థానాల్లో నియామకాలకు లేటరల్ ఎంట్రీ విధానం కింద కేంద్రం యూపీఎస్సీ ద్వారా దరఖాస్తులు ఆహ్వానించడంపై విపక్షాలు మండిపడ్డాయి. ఇది దొడ్డిదారిన తమ సైద్ధాంతిక మిత్రులను ఉన్నత స్థానాల్లో నియమించుకోవడానికి బీజేపీ పన్నిన కుట్ర అని ధ్వజమెత్తాయి. ఇది పూర్తిగా రాజ్యాంగ ఉల్లంఘనే అని పేర్కొన్నాయి. సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ ఈ నిర్ణయంపై అక్టోబర్ 2 నుంచి ఉద్యమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ విధానం ప్రస్తుతం పనిచేస్తున్న అధికారులు, యువత భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరే మార్గాలను మూసివేస్తుందని అన్నారు. సామాన్యులు గుమస్తాలు, ప్యూన్ ఉద్యోగాలకే పరిమితం అవుతారని అన్నారు. మొత్తం మీద ఈ విధానం ద్వారా దళితులు, మైనారిటీలు, వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లను, హక్కులను లాక్కోవడానికి కేంద్రం పన్నిన కుట్ర అని ఆయన ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అణగదొక్కడమే కాక, రిజర్వేషన్ల విధానంపై రెట్టింపు దాడి చేస్తున్నదని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విభాగాల వారికి రిజర్వేషన్ ఫలాలు దక్కకుండా చేయడానికి మోదీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఈ పనికి పూనుకున్నదని అన్నారు.

ఇదో క్రూరమైన జోక్: తేజస్వీ

మన దేశంలోని రిజర్వేషన్ల వ్యవస్థ, రాజ్యాంగంపై కేంద్రం క్రూరమైన జోక్ వేసిందని మోదీ ప్రభుత్వాన్ని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ విమర్శించారు. లేటరల్ ఎంట్రీ ద్వారా చేపట్టే 45 పోస్టుల నియామకాన్ని ప్రస్తుత సంప్రదాయ సివిల్ సర్వీస్ పరీక్షల ద్వారా చేపడితే ఇంచుమించు సగం పోస్టులు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు దక్కుతాయని అన్నారు. కాగా, 2018లో ఈ విధానం ద్వారా కేంద్రం 63 పోస్టుల నియామకాలు చేపట్టగా, 35 మంది ప్రైవేట్ సెక్టార్‌కు చెందిన వారు. వీరిలో ప్రస్తుతం 57 మంది వివిధ మంత్రిత్వ, ప్రభుత్వ శాఖల్లో ముఖ్యమైన హోదాల్లో ఉన్నారు.

ఐఐటీ-న్యూఢిల్లీకి జీఎస్టీ నోటీసులు
ఇది ట్యాక్స్ టెర్రరిజమే.. మోహన్‌దాస్ పాయ్ విమర్శలు

న్యూఢిల్లీ: ఐఐటీ-న్యూఢిల్లీకి జీఎస్టీ డైరెక్టర్ జనరల్ నోటీసులు జారీ చేశారు. రిసెర్చ్ కోసం 2017 నుంచి 2022 వరకు సంస్థకు వచ్చిన నిధులపై జీఎస్టీ, వడ్డీ, అపరాధ రుసుములు కలిపి రూ.120 కోట్లు చెల్లించాలంటూ నోటీసులో పేర్కొన్నారు. దీనిపై 30 రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. పలు సెంట్రల్ యూనివర్సిటీలు, ఐఐటీలు, రాష్ట్రాల్లోని పలు ప్రైవేట్ యూనివర్సిటీలు, విద్యాసంస్థలకు కూడా జీఎస్టీ నోటీసులు జారీ చేసినట్టు అధికారులు తెలిపారు. దీనిపై కేంద్ర విద్యా శాఖలోని ఉన్నతాధికారి ఒకరు స్పందిస్తూ సాధారణంగా పరిశోధనల నిమిత్తం విద్యా సంస్థలకు ఇస్తున్న నిధులపై జీఎస్టీ విధించరని, ఇది పొరపాటున జరిగి ఉంటుందని భావిస్తున్నామన్నారు. పరిశోధనల అభివృద్ధికి విద్యాసంస్థలకు వచ్చే నిధులపై జీఎస్టీ విధించడం పట్ల ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది ట్యాక్స్ టెర్రరిజమని పేర్కొంటూ దీనికి అంతులేదా? అని ప్రశ్నించారు.

కర్ణాటకలో ముడా ప్రకంపనలు!

22న సీఎల్పీ భేటీ ఏర్పాటు చేసిన సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు, ఆగస్టు 18: ముడా భూకుంభకోణం ఆరోపణలు కర్ణాటకలో ప్రకంపనలు రేపుతున్నాయి. ఈ కేసులో తనను విచారించేందుకు గవర్నర్ అనుమతిచ్చిన నేపథ్యంలో సీఎం సిద్ధరామయ్య ఈనెల 22న సీఎల్పీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు సీఎంవో ఆదివారం ప్రకటన విడుదల చేసింది. విధాన సౌధ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ సమావేశం జరుగుతుందని తెలిపింది. భేటీపై రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే మీడియాతో మాట్లాడుతూ కేసు వాస్తవాలు, అసలు ఏం జరుగుతుందనే దానిపై సీఎం సిద్ధరామయ్య ఎమ్మెల్యేలకు వివరిస్తారని తెలిపారు. ఈ కేసును న్యాయపరంగా, రాజకీయంగా ఎదుర్కొనే విషయంపై ఒక వ్యూహాన్ని రూపొందిస్తారని పేర్కొన్నారు.

ఆర్నెల్లలో సగం మంది బీజేపీ నేతలు జైలుకు: ప్రియాంక్ ఖర్గే

రాష్ట్రంలోని సగం మంది బీజేపీ నేతలు వచ్చే ఆర్నెల్లలో జైల్లో ఉంటారని లేదా బెయిల్ కోసం పరుగులు పెడతారని ప్రియాంక్ ఖర్గే సంచలన వ్యాఖ్యలు చేశారు. గత బీజేపీ ప్రభుత్వం అవినీతిపై తమ సర్కార్ లోతుగా దర్యాప్తు చేయనున్నదని అన్నారు. గత ప్రభుత్వంలో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపించారు. బీజేపీ నేతలపై 35కు పైగా కేసులు నమోదయ్యాయని, 3-4 కేసుల్లో మధ్యంతర నివేదికలు కూడా వచ్చాయని తెలిపారు.

గుండెపోటుతో కోస్ట్ గార్డ్ చీఫ్ మృతి

చెన్నై: ఇండియన్ కోస్ట్ గార్డ్ డైరెక్టర్ జనరల్ రాకేశ్ పాల్ ఆదివారం గుండెపోటుతో మరణించారు. అకస్మాత్తుగా అస్వస్థతగా ఉన్నట్లు ఆయన చెప్పడంతో రాజీవ్ గాంధీ జనరల్ హాస్పిటల్‌లో చేర్చగా చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. కోస్ట్ గార్డ్ నిర్వహించే కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తోపాటు రాకేశ్ పాల్గొనవలసి ఉంది. రాకేశ్ మరణ వార్త తెలిసిన వెంటనే రాజ్‌నాథ్ దవాఖానకు వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారు. తమిళనాడు మాజీ సీఎం కరుణానిధి జయంత్యుత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నాణెం విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాజ్‌నాథ్ చెన్నైకి వచ్చారు.

చావునే చీట్ చేస్తారట!

న్యూయార్క్, ఆగస్టు 18: ప్రతి మనిషికి మరణం అనేది కామన్. ఎంత గొప్పగా బతికినా.. ఆరడుగుల జాగాలోనే తనువు చాలించాలి. అలాంటిది.. చావునే చీట్ చేసి బతికేస్తే..! అదీ యవ్వనంగా కనిపించేలా జీవిస్తే..! దాన్ని సుసాధ్యం చేస్తామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు అమెరికా శాస్త్రవేత్తలు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ శాస్త్రవేత్తలు ఆ దిశగా పరిశోధనలు చేపట్టారు. ల్యాబ్‌లో అభివృద్ధి చేసిన న్యూరోనాల్ మూల కణాలతో మెదడు కణజాలాన్ని రిపేర్ చేసి విజయవంతంగా బతికేయొచ్చని అంటున్నారు. ఎలుకల్లో చేసిన పరిశోధనలు విజయవంతం అయ్యాయని చెప్తున్నారు. మెదడు కణజాల మార్పిడి ద్వారా ఆశాజనక ఫలితాలు సాధించామని పరిశోధనలో భాగమైన డాక్టర్ హెబర్ట్ పేర్కొన్నారు. అయితే, ఈ పరిశోధనపై పలువురు శాస్త్రవేత్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు.

మహారాష్ట్రలో సిమెంట్ వెల్లుల్లి

ముంబై : కాదేదీ నకిలీకి అనర్హం అన్నట్టుగా ఇప్పటికే నకిలీ కోడిగుడ్లు, నకిలీ బియ్యం మార్కెట్లో దర్శనమిస్తూ ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటుండగా, ఇప్పుడు మార్కెట్లను నకిలీ వెల్లుల్లి కూడా ముంచెత్తనుంది. సిమెంట్‌తో తయారు చేసిన నకిలీ వెల్లుల్లి మహారాష్ట్రలోని అకోలాలో దర్శనమివ్వడంతో ఇప్పుడు దానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో కన్పిస్తున్న వెల్లిగడ్డను చూస్తే మామూలు వెల్లిగడ్డలానే కన్పించింది. అయితే దాని రేక ఒకటి తీసి చూడగా, లోపలి భాగమంతా సిమెంట్‌తో నిండి గట్టిగా ఉండటం చూసేవారికి షాక్‌ను కలిగిస్తున్నది. వెల్లిగడ్డ పై పొర మాత్రమే అలాగే ఉంచి లోపలంతా సిమెంట్‌ను నింపి మార్కెట్లోకి వదులుతున్నారు. సిమెంట్‌తో చేసిన నకిలీ వెల్లుల్లి అసలు స్టాక్‌లో కలిపి అమ్మేస్తున్నారని అనుమానిస్తున్నారు.



నాలుక రంగుతో వ్యాధుల నిర్ధారణ!

బీజింగ్: నాలుక రంగును చూసి రియల్ టైమ్‌లో 98 శాతం కచ్చితత్వంతో వ్యాధులను గుర్తించే కృత్రిమ మేధ(ఏఐ) కంప్యూటర్ అల్గారిథమ్‌ను సృష్టించినట్టు ఇరాక్, ఆస్ట్రేలియా పరిశోధకులు వెల్లడించారు. అసోసియేట్ ప్రొఫెసర్ అలీ అల్-నజీ అధ్యయనం ప్రకారం మధుమేహ రోగుల నాలుక పసుపు రంగులో, క్యాన్సర్ రోగుల నాలుక తరచూ మందమైన పూతతో ఊదా రంగులో, బ్రెయిన్ స్ట్రోక్ రోగుల్లో ఎరుపు రంగులో ఉంటుంది. నాలుక చిత్రాల ద్వారా రోగమేదో కనిపెట్టడానికి చైనా సంప్రదాయ వైద్యం తనకు స్ఫూర్తిని ఇచ్చిందని నజీ తెలిపారు. 5,200 చిత్రాలను ఉపయోగించి నాలుక రంగును బట్టి వ్యాధిని నిర్ధారించడంలో ఈ ఏఐ నమూనాకు శిక్షణ ఇచ్చారు. చిత్రాలను బట్టి వ్యాధి ఏమిటో ఏఐ సరిగ్గా అంచనా వేసింది.



శరీర వేడిమితో విద్యుత్తు

ఒంటారియో (కెనడా): మొబైల్ ఫోన్లు, చేతి గడియారాలు, టీవీలు సహా ఎన్నో రకాల వస్తువులు ఇప్పటికే స్మార్ట్‌గా మారిపోయాయి. సమీప భవిష్యత్తులో దుస్తులు సైతం ఈ జాబితాలో చేరనున్నాయి. సూర్యరశ్మిని ఉపయోగించి మనల్ని వెచ్చగా ఉంచే స్మార్ట్ ఫ్యాబ్రిక్‌తో సూట్‌లు, కోట్‌లు తయారు చేయబోతున్నారు. ఇందుకు అవసరమైన స్మార్ట్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీని వాటర్లూ యూనివర్సిటీ పరిశోధకులు ప్రదర్శించారు. సూర్యరశ్మితో పాటు మన శరీరం నుంచి వెలువడే ఉష్ణాన్ని విద్యుత్తుగా మార్చగలిగేలా రూపొందించిన ఈ ఫ్యాబ్రిక్ ధరించేందుకు ఎంతో అనువుగా ఉంటుంది. సెన్సర్లను అనుసంధానించుకుని, గుండె లయను, శరీర ఉష్ణోగ్రతను పర్యవేక్షించేందుకు స్మార్ట్ ఫ్యాబ్రిక్‌ను ఉపయోగించుకోవచ్చని పరిశోధకులు తెలిపారు.



అమెరికాలో మళ్లీ కరోనా కలవరం!

వాషింగ్టన్: కొవిడ్ కొత్త వేరియెంట్ 'కేపీ.2' అమెరికాను వణికిస్తున్నది. దవాఖానల్లో చేరుతున్నవారి సంఖ్య పెరుగుతున్నది. ప్రతి 10 లక్షల మందికి ఒకటి నుంచి నాలుగుకు పెరిగింది. 2022 జూలై తర్వాత, మురుగునీటిలో వైరల్ యాక్టివిటీ (ఆగస్టు 10న 8.82) అత్యధిక స్థాయికి చేరుకుంది. వేసవి సీజన్‌లో కరోనా వ్యాప్తి ఎక్కువగా ఉందని సీడీసీ గణాంకాలు చెబుతున్నాయి. 'శాంపిల్స్‌లో 100% 'సార్స్-కోవ్-2'ను గుర్తించాం' అని వేస్ట్‌వాటర్ స్కాన్' ప్రోగామ్ డైరెక్టర్ మార్లినె అన్నారు. స్కూళ్ల సెలవులు ముగిసాక, కేసుల సంఖ్య పెరిగే అవకాశముందని వైద్య వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎఫ్‌డీఏ అనుమతులు వస్తే, కేపీ.2 వేరియెంట్‌కు కొత్త వ్యాక్సిన్ ఈ ఏడాది సెప్టెంబర్‌లో అందుబాటులో వస్తుందని తెలిసింది.